క్లుప్తంగా

డీజీపీని కలిసిన కరాటే మాస్టర్



డీజీపీ శివధర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న చెన్నయ్య

షాద్‌నగర్: డీజీపీగా బాధ్యతలు చేపట్టిన శివధర్‌రెడ్డిని సోమవారం స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ చైర్మన్ మాస్టర్ ఎత్తిన చెన్నయ్య కలిశారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు పద్మ

మొయినాబాద్‌రూరల్: మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతి సోమవారం కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని, మండలంలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యురాలు పద్మ అన్నారు. సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పలువురికి కంటి పరీక్షలు నిర్వహించారు. ప్రభుత్వం ద్వారా అవసరమైన వారికి కంటి డ్రాప్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నియోజకవర్గంలో అన్ని ఆస్పత్రుల్లో వారానికి ఒక రోజు పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉచిత కంటి శిబిరాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



కాలనీలో తనిఖీ చేస్తున్న పోలీసులు

కడ్తాల్: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ గంగాధర్ హెచ్చరించారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో.. సోమవారం సమగ్రత భద్రతా ఏర్పాట్లలో భాగంగా.. మండల కేంద్రంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా తనిఖీలు చేపట్టడంతో పాటు, పలు అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎన్నికల సమయంలో ప్రశాంతంగా, క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. ఎవరైనా అల్లర్లు, గందరగోళం సృష్టించే ప్రయత్నాలు చేస్తే.. పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఎన్నికల సమయంలో ఎవరైనా అనధికారికంగా మద్యం విక్రయించి, అధిక ధరలకు అమ్మినా కేసులు నమోదు చేస్తామని చెప్పారు. గాంజా, మత్తు పదార్థాలు సేవించినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అక్రమ కార్యకలాపాల గురించి సమాచారం ఇచ్చిన వారి.. వివరాలను గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు వరప్రసాద్, చంద్రశేఖర్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

స్థానిక ఎన్నికల్లో విజయమే లక్ష్యం

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు: స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. సోమవారం ఎమ్మెల్యేను నగరంలోని ఆయన నివాసంలో కాంగ్రెస్ పార్టీ ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల్ మండలాల నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. పంచాయతీ ఎన్నికల గురించి చర్చించారు. ఈ సందర్భంగా ఆమనగల్లు జెడ్పీటీసీగా పోటీ చేసేందుకు అవకాశం ఇవ్వాలని ఆ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు, చెంచు యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మండ్లి రాములు.. నాయకులతో కలిసి ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రజాసంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న ప్రభుత్వ విజయాన్ని ఎవరూ ఆపలేరన్నారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. సమష్టిగా పార్టీ విజయం కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు అయిల శ్రీనివాస్‌గౌడ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ అనిత, మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ కేశవులు, మాజీ వైస్ ఎంపీపీ నారాయణ, డీసీసీ అధికార ప్రతినిధి గూడురు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు వెంకటరమణారెడ్డి, రచ్చ శ్రీరాములు, నాయకులు జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆశలు ఆవిరి!

- రిజర్వేషన్లు తారుమారుతో అభ్యర్థుల వేటలో రాజకీయ పార్టీలు
- ముఖ్య నేతలతో సమావేశాలు, చర్చలు
- బలమైన నేతలను పోటీలో నిలిపేలా చర్యలు
- రెండు ఎన్నికలు ఒకేసారి ఉండటంతో ఎంపీటీసీగా పోటీచేసేందుకు అనాసక్తి



ఎంపీడీఓ కార్యాలయం

చేవెళ్ల: స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఎన్నోరోజుల నుంచి ఎదురుచూస్తున్న ఆశావాహుల ఆశలు ఈ రిజర్వేషన్ల ప్రకటనతో అడియాశలయ్యాయి. మండలంలోని అన్ని గ్రామాల్లో ఊహించిన రిజర్వేషన్లు ఏ నాయకునికి రాకపోవటంతో అంతా అయోమయంలో పడ్డారు. కొన్ని గ్రామాల్లో పోటీచేసేందుకు ఆ పార్టీలలో నాయకులే లేకపోవటంతో గ్రామంలోని కొత్తవారిని సిద్ధం చేసకుంటున్నారు. గతంలో అయితే సర్పంచులుగా పోటీచేసి ఓటమి పాలైన వారు మళ్లీ ఎంపీటీసీ ఎన్నికల్లో పోటీచేసేందుకు సిద్ధంగా ఉండేవారు. ఇప్పుడు రెండు ఎన్నికలు ఒకేసారి ఉండటంతో రిజర్వేషన్‌లు కూడా ముందుగానే ఉండటంతో ఎక్కువ మంది సర్పంచ్‌గా వచ్చిన అవకాశాన్ని ఎంచుకుంటున్నారు. దీంతో ఎంపీటీసీగా పోటీచేసేందుకు ఆసక్తి చూపించటం లేదు. ఇలా కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ అన్ని పార్టీల్లో ఇదే పరిస్థితి ఉండటంతో మండల నాయకులు ఎవరిని పోటీలో దించితే బాగుంటుంది.. ఇతర పార్టీలో నిలబడే అభ్యర్థులు ఎవరో చూసి వారికి తగిన వారిని ఎంపిక చేసుకోవాలనే ఆలోచనలో పడ్డారు.

అభ్యర్థుల కోసం కసరత్తు

మండలంలో మొత్తం 25 పంచాయతీలు, 10 ఎంపీటీసీ స్థానాలు, జెడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలకు స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయి. అయితే ఈ ఎన్నికల్లో వచ్చిన రిజర్వేషన్లు నాయకులను అయోమయానికి గురిచేస్తున్నాయి. ఎస్సీ ఓటర్లు ఉన్నచోట జనరల్ రిజర్వేషన్లు, బీసీలు ఉన్న చోట జనరల్, ఎస్సీ రిజర్వేషన్లు, అసలు జనరల్ ఓటర్లే తక్కువగా ఉన్నచోట కూడా జనరల్ స్థానాలకు సీట్లు రిజర్వు కావటం అయోమయంగా మారింది. జనాభా ఓటర్ల ప్రకారం రిజర్వేషన్లు వస్తే తమకు అవకాశం రావాలని ఆశించిన గ్రామాల్లో తారుమారు అయ్యాయి. మండలంలోని తలారం, ఈర్లపల్లి, సింగప్పగూడ, గొల్లగూడ, మిర్జాగూడ గ్రామాల్లో మెజార్టీ ఓటర్లు ఎస్సీలు, బీసీలు ఉంటే ఒక శాతం కూడా లేని జనరల్ అభ్యర్థులకు సర్పంచ్ రిజర్వు అయింది. జనరల్ అభ్యర్థులు ఎక్కువగా ఉన్న గ్రామాల్లో మాత్రం ఎస్సీ, బీసీలకు రిజర్వేషన్లు వచ్చాయి. ఇదే తరహా ఎంపీటీసీ స్థానాలు కూడా రావటంతో నేతల రాతలు తారుమారయ్యాయి. దీంతో అక్కడ పోటీలో ఎవరిని పెట్టాలనే ఆలోచనలో పార్టీల నాయకులు నిమగ్నమయ్యారు. నోటిఫికేషన్ 9న విడుదలైతే ఎన్నికల ప్రచారానికి వారంరోజులే గడువు ఉండటంతో అంతలోపు అభ్యర్థుల ప్రకటన చేసుకోవాల్సిన అవసరం ఉంది. కోర్టు తీర్పుతో ఎన్నికలు జరుగుతాయా లేదా అని మరో సందేహంతో స్థానిక ఎన్నికలపై నాయకుల్లో సందిగ్ధత నెలకొంది. తారుమారైన అభ్యర్థుల రిజర్వేషన్లతో తలలు పట్టుకుంటున్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం



మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మధుసూదన్‌రెడ్డి

షాబాద్: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండలంలోని పెదవేడు తండాకు రోడ్డు మార్గం లేకపోవడంతో గతంలో తండా వాసులందరూ ఆయనను కలిసి విన్నవించుకున్నారు. వారి విన్నపం మేరకు శంషాబాద్ రోడ్డు నుంచి తండాకు రోడ్డు మార్గం ఏర్పాటు చేసినందుకు వారందరూ ఆయనకు కృతజ్ఞతలు తెలుపుతూ సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో సమస్యలను దశల వారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రజా సంక్షేమానికి పార్టీలకతీతంగా పాటుపడుతున్నామన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులకు శ్రీకారం చూడతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ నర్సింలుగౌడ్, మాజీ సర్పంచ్‌లు జనార్దన్‌రెడ్డి, ఖాజామియాపటేల్, శ్రీనివాస్‌గౌడ్, నరేందర్‌రెడ్డి, బండ్లగూడ మాజీ సర్పంచ్ యాదయ్యగౌడ్, ప్రేమ్‌గౌడ్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కుమ్మరి చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం



పార్టీలో చేరిన వారికి కుండువాలు కప్పి ఆహ్వానిస్తున్న అవినాశ్‌రెడ్డి

జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పట్నం అవినాశ్‌రెడ్డి

షాబాద్: రాష్ట్ర అభివృద్ధి బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమవుతుందని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పట్నం అవినాశ్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో అవినాశ్‌రెడ్డి సమక్షంలో కుర్వగూడ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు అశోక్‌యాదవ్, రాందాస్‌యాదవ్, నర్సింలుయాదవ్, శివరాజ్‌యాదవ్, శివకుమార్‌ముదిరాజ్, రాంచంద్రయ్య, సదానందం, శివకృష్ణ, మహేందర్, కృష్ణ, శంకరయ్య, రాములు, రాజ్‌కుమార్‌స్వామి, రామస్వామి, రమేష్, నరేష్‌కుమార్, నవీన్, శంకర్, నర్సింలు, మాధవులు, శివ, చంద్రయ్యతో పాటు మరి కొంత మంది గులాబీ గూటికి చేరారు. ఈ సందర్భంగా ఆయన వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర అభివృద్ధి కేసీఆర్‌తోనే సాధ్యమవుతుందన్నారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. ఎన్నికలు ఏవైనా రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీ గెలుపొందడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. స్థానిక సంస్థలలో అన్ని స్థానాల్లో బీఆర్‌ఎస్ కైవసం చేసుకోవడం ఖాయమన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడూరు నర్సింగరావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎస్.వెంకటయ్య, పార్టీ నాయకులు శ్రీనివాస్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఆకర్షితులై చేరికలు



పార్టీలో చేరిన వారితో నేతలు

సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి

షాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఇతర పార్టీల నాయకులు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఏట్లఎర్రవల్లి గ్రామానికి చెందిన పీసరి సతీష్‌రెడ్డి, కటిక హరీష్, కుమ్మరి రమేశ్, కొత్త కుర్వ మల్లేశ్, కాట్నా మనోహర్, కటిక రవి, ఉమ్మెంతలా రమేశ్, మల్కి మాణయ్య, కాట్నా మహేందర్‌తో పాటు 30 మంది యువకులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన వారందరికీ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. షాబాద్ మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లి స్థానిక ఎన్నికల్లో సత్తా చాటేలా సమష్టిగా ముందుకు సాగాలని పార్టీ కార్యకర్తలకు సూచించారు. పార్టీని మరింత బలోపేతం చేసేలా ఐక్యంగా పని చేయాలన్నారు. ఎలాంటి విభేదాలకు తావులేకుండా పార్టీ పటిష్టత, స్థానిక సంస్థలన్నింటిలో విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు. కష్టపడి పనిచేసిన వారికి గుర్తింపు ఉంటుందన్నారు. ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పీసరి వెంకట్‌రెడ్డి, కుమ్మరి వేణుగోపాల్, రాజేందర్‌రెడ్డి, కాట్నా శ్రీనివాస్, ఆంజనేయులు, ఇబ్రహీంఖాన్, అమరేందర్‌రెడ్డి, మల్కి నర్సింహులు, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

ఆధ్యాత్మికతతో ప్రశాంతత

మంచాల: భక్తిభావంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ అన్నారు. సోమవారం మండల పరిధి దాద్‌పల్లిలో రామాంజనేయ స్వామి నూతన ఆలయంలో స్వామివారి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఇరువురు మాట్లాడుతూ.. ఉరుకుల పరుగుల జీవితంతో ప్రతిఒక్కరూ మానసిక ఒత్తిడికి గురవుతున్నారని తెలిపారు. ఆధ్యాత్మికతతో కొంత ఊరట కలుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు గోగిరెడ్డి లచ్చిరెడ్డి, వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డి, వివిధ పార్టీల నాయకులు నూకం రాజు, పాండాల జంగయ్య గౌడ్, శ్రీశైలం, చంద్రయ్య, బహదూర్, పుల్లరెడ్డి, వెంకటేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

ఉబికి వచ్చిన గంగమ్మ



బోరులో నుంచి పైకి వస్తున్న నీరు

కేశంపేట: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చెరువులు, కుంటలు పూర్తిగా నిండాయి. భూగర్భ జలాల మట్టం భారీగా పెరిగింది. కేశంపేట మండల పరిధిలోని పాపిరెడ్డిగూడలో జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు తాండ్ర విశాలశ్రావణ్‌రెడ్డి వ్యవసాయ పొలంలో వృథాగా పడి ఉన్న బోరులో నుంచి సోమవారం నీరు ఉబికి పైకి వస్తున్నాయి. దీంతో బోరు బావిలో నుంచి నీరు వస్తున్న విషయం తెలుసుకున్న గ్రామస్తులు పెద్దఎత్తున అక్కడికి చేరుకొని పరిశీలించారు. వర్షాలు బాగా కురవడంతో భూగర్భజలాలు పెరిగి నీరు పైకి వస్తుందని ప్రజలు చర్చించుకున్నారు.

అమ్మవారికి వేతనం వితరణ



విరాళం అందజేస్తున్న తేజస్విని కుటుంబ సభ్యులు

యాచారం: సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని.. తన మొదటి నెల వేతనాన్ని నందివనపర్తి జ్ఞాన సరస్వతి ఆలయాభివృద్ధికి విరాళం అందించింది. మండల పరిధి ఆరుట్ల గ్రామానికి చెందిన భార్గవి, వెంకట్‌రెడ్డి దంపతుల కుమార్తె తేజస్విని.. యూఎస్‌లో ఉద్యోగం చేస్తోంది. అమ్మవారి దీవెనలతోనే విదేశంలో కొలువు లభించిందని తన జీతం డబ్బులు రూ.1,01,116ను సోమవారం.. ఆలయ ఫౌండర్ సదా వెంకట్‌రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు రాఘవేంద్రశర్మ.. యువతి కుటుంబ సభ్యులను సన్మానించారు.

ప్రాణాలతో చెలగాటం!



కొత్తూరు పారిశ్రామికవాడ

- రక్షణ కవచాలు కరువు
- ప్రమాదాల్లో మృత్యువాత పడుతున్న కార్మికులు
- పట్టించుకోని పరిశ్రమల యాజమాన్యాలు

కొత్తూరు: కార్మికుల శ్రమతో కోట్ల రూపాయల లాభాలు అర్జిస్తున్న పరిశ్రమల నిర్వాహకులు వారి సంక్షేమాన్ని మాత్రం పట్టించుకోవడం లేదు. చట్ట ప్రకారం కార్మికులకు కనీస వేతనాలు, పనిచేసే చోట రక్షణ పరికరాలు కల్పించడం లేదు. దీంతో పరిశ్రమల్లో ఏ చిన్న ప్రమాదం చోటు చేసుకున్న కార్మికులు తీవ్రంగా గాయపడడం లేదా మృత్యువాత పడుతున్నారు. పరిశ్రమలను సందర్శించి కార్మికులకు కల్పిస్తున్న సౌకర్యాలు, వసతులను పరిశీలించాల్సిన సంబంధిత శాఖల అధికారులు ముడుపుల మాయలో అంతగా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. మండలంలో పదుల సంఖ్యలో బహుళజాతి, వందల సంఖ్యలో మధ్య తరహా, చిన్న తరహా పరిశ్రమలు కొనసాగుతున్నాయి. అన్ని పరిశ్రమల్లో బీహార్, ఉత్తర ప్రదేశ్, రాజస్థాన్, ఒడిస్సాతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన సుమారు పదివేల మందికిపైగా కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు.

అవగాహన లేక ప్రమాదాలు

ప్రమాదకర యంత్రాల వద్ద పనిచేసే కార్మికులకు పరిశ్రమ యాజమాన్యం ముందుగా యంత్రాల పనితీరు, ప్రమాదాలు జరిగితే తప్పించుకునే విధానం.. ఇతర జాగ్రత్తలపై తరచూ కార్మికులకు అవగాహన కల్పించాలి. అంతేకాకుండా యంత్రాల వద్ద పనిచేసే కార్మికులకు తప్పకుండా గ్లౌజులు, షూస్, హెల్మెట్లు ఇతర రక్షణ కవచాలను అందించాలి. కానీ మండలంలో కొనసాగుతున్న పలు పరిశ్రమల్లో కార్మికులకు యాజమాన్యాలు రక్షణ కవచాలను అందించడం లేదు. నిరక్షరాస్యత, ఆర్థిక ఇబ్బందుల కారణంగా బీహార్, ఉత్తరప్రదేశ్‌తో పాటు పలు రాష్ట్రాలకు చెందిన కార్మికులు రక్షణ కవచాలు లేకుండానే ప్రమాదకర యంత్రాల వద్ద విధులు నిర్వహిస్తున్నారు. దీంతో ఏ చిన్న ప్రమాదం చోటు చేసుకున్న కార్మికులు తీవ్రంగా గాయపడడం లేదా మృత్యువాత పడడం జరుగుతోంది.

పర్యవేక్షణ లోపంతోనే ప్రమాదాలు



అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగానే పరిశ్రమల్లో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. తరచూ పరిశ్రమలను సందర్శించి కార్మికులకు కల్పిస్తున్న సౌకర్యాలు, వసతులను అధికారులు పరిశీలించాలి. యంత్రాల వద్ద పనిచేసే కార్మికులకు రక్షణ కవచాలు అందించే విధంగా యాజమాన్యాలకు సూచించాలి. అప్పుడే ప్రమాదాలను సాధ్యమైనంతవరకు నియంత్రించే అవకాశం ఉంటుంది.

–పానుగంటి పర్వతాలు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి

ప్రమాదాలు ఇలా..

- గత నెల 14న తీగాపూర్ సమీపంలోని రాయలసీమ పరిశ్రమలో విధుల్లో భాగంగా బీహార్ రాష్ట్రానికి చెందిన దీపక్ అనే కార్మికుడు క్రేన్‌తో ఇనుప చువ్వలు లోడ్ చేస్తున్నాడు. అన్‌లోడ్ చేసే క్రమంలో సరైన జాగ్రత్తలు పాటించకపోవడంతో ఇనుప చువ్వలు అతడిపై పడ్డాయి. పరిశ్రమ నిర్వాహకులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించి మృతి చెందాడు.
- రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన ఓంప్రకాశ్(40) గత కొన్ని నెలల నుంచి పారిశ్రామికవాడలో ఉన్న కేశ్రీ మెటల్ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. ఈ నెల 3న విధుల్లో భాగంగా ఫర్నస్ నుంచి వేడిగా బయటకు వచ్చే 8 ఎంఎం రాడ్‌ను పత్కార్‌తో పట్టుకొని చల్లబర్చే చోట పనిచేస్తున్నాడు. కాగా వేడిగా ఉన్న ఇనుప రాడ్ చాతిలోకి దూసుకెళ్లింది. వెంటనే పరిశ్రమ యాజమాన్యం చికిత్స నిమిత్తం హైద్రాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించి మృతి చెందాడు.

తీరిన వరదనీటి సమస్య

- చిలుకూరు పెద్దచెరువు వద్ద పైపుల ఏర్పాటు
- రోడ్డుపై నీరు నిల్వకుండా చర్యలు



పెద్ద చెరువు వద్ద పైపులు వేసి వాహనాలు వెళ్లేందుకు వీలుగా ఏర్పాటు చేసిన రోడ్డు

మొయినాబాద్: చిలుకూరు పెద్దచెరువు వద్ద నలభై రోజుల పాటు వాహనదారులు పడ్డ ఇబ్బందులు ఎట్టకేలకు తీరాయి. చెరువు అలుగునీరు వెళ్లేందుకు వీలుగా పైపులు వేసి.. వాటిపై నుంచి వాహనాలు వెళ్లేందుకు ఏర్పాట్లు చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని చిలుకూరు పెద్ద చెరువు ఆగస్టులో కురిసిన వర్షాలకు పూర్తిస్థాయిలో నిండింది. అలుగు కింది భాగం నుంచి రోడ్డు ఉండటంతో అలుగు నీరు రోడ్డుపైకి చేరాయి. సుమారు నెల రోజులకు పైగా రోడ్డుపై నుంచి నీరు పారడంతో పెద్ద గుంతలు ఏర్పడి వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. మొదట్లోనే సమస్యను తీర్చకుండా మున్సిపల్, ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ అధికారులు నిర్లక్ష్యం వహించారు. సమస్య తీవ్రం కావడంతో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఈ రోడ్డుపై వెళ్తూ గుంతను పరిశీలించి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేయగా.. అధికార యంత్రాంగం కదిలింది. జిల్లా కలెక్టర్ ప్రత్యేక నిధులతో ఆర్‌అండ్‌బీ అధికారులు అలుగు నీరు వెళ్లేందుకు వీలుగా పైపులు వేసి పైనుంచి మట్టి పోసి రోడ్డు వేశారు. దీంతో అలుగు నీరు రోడ్డుపైకి రాకుండా పైపుల ద్వారా దిగువకు వెళ్తున్నాయి. మట్టి పోసి రోడ్డు వేయడంతో ఇబ్బంది లేకుండా వాహనాలు వెళ్తున్నాయి. ఇన్ని రోజులకైనా అధికారులు స్పందించి సమస్యను తీర్చడంతో స్థానిక ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

ట్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్ మార్చాలి



హెచ్‌ఎండీఏ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

సీపీఎం డివిజన్ కార్యదర్శి శ్రీనునాయక్

షాద్‌నగర్: రైతులు పంటలు పండించే భూముల నుంచి రీజనల్ రింగ్ రోడ్డు నిర్మించొద్దని, కొత్త అలైన్‌మెంట్‌ను ప్రభుత్వం వెంటనే మార్చాలని సీపీఎం డివిజన్ కార్యదర్శి శ్రీనునాయక్ డిమాండ్ చేశారు. సోమవారం కేశంపేట మండలం తొమ్మిదిరేకుల, ఫరూఖ్‌నగర్ మండలం భీమారం, అయ్యవారిపల్లి, ఉప్పరిగడ్డతండా, కొందుర్గులోని తంగెళ్లపల్లి, చెరుకుపల్లి, తుమ్మలపల్లి గ్రామాలకు చెందిన పలువురు రైతులు సీపీఎం నాయకులతో కలిసి హైదరాబాద్‌లోని హెచ్‌ఎండీఏ కార్యాలయానికి తరలివెళ్లి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనునాయక్ మాట్లాడుతూ.. పంటలు పండే పొలాల గుండా రోడ్డు నిర్మిస్తే ఎంతో విలువైన భూములను రైతులు కోల్పోవడంతో పాటు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న రైతులు రోడ్డున పడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన రీజనల్ రింగ్ రోడ్డు మార్కింగ్‌ను మార్చి.. పాత పద్ధతి ప్రకారమే నిర్మించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రస్తుత అలైన్‌మెంట్‌ను వెంటనే మార్చాలన్నారు. రైతులు తమకున్న కొద్దిపాటి పొలాల్లో పంటలు పండించుకొని జీవనం సాగిస్తున్నారని, అలాంటి రైతుల పొలాల గుండా ప్రభుత్వం రోడ్డు నిర్మిస్తామని చెప్పడం సరికాదన్నారు. ప్రభుత్వం గ్రామాల్లో రైతులతో గ్రామసభలను నిర్వహించాలని, ప్రజల ఆమోదం మేరకు ప్రజలకు అవసరం లేని భూములను మాత్రమే ప్రభుత్వం తీసుకొని రోడ్డు నిర్మించాలన్నారు. అలా కాకుండా రైతులను ఇబ్బందులకు గురిచేసి బలవంతంగా భూములు తీసుకునేందుకు ప్రయత్నిస్తే చూస్తే ఊరుకోమన్నారు. పాత అలైన్‌మెంట్ ప్రకారమే రోడ్డు నిర్మించాలని, లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. రైతుల పోరాటానికి తాము అండగా నిలుస్తామన్నారు. కార్యక్రమంలో రైతులు చంద్రకాంత్, రమేశ్, హరీశ్, నరేశ్, సుదర్శన్‌రెడ్డి, యాదయ్య, భీమయ్య, మల్లయ్య, సత్తయ్య, యాదమ్మ, విజయ, అనంతమ్మ, మాణెమ్మ, లక్ష్మమ్మ, కుమార్, శోభ, మంజుల శివరాములు తదితరులు పాల్గొన్నారు.

నేతల ముందస్తు అరెస్టు



షాద్‌నగర్: పోలీస్ స్టేషన్‌లో సీపీఎం, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు

షాద్‌నగర్: ట్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్‌ను మార్చాలని డిమాండ్ చేస్తూ హెచ్‌ఎండీఏ కార్యాలయం ఎదుట ధర్నా చేసేందుకు వెళ్తున్న సీపీఎం, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులను సోమవారం ఉదయం షాద్‌నగర్ పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అనంతరం వారిని సొంత పూచీకత్తుపై విడదల చేశారు. రైతుల పక్షాన నిలబడి పోరాటం చేస్తుంటే పోలీసులు అక్రమ అరెస్టులు చేయడం సరికాదని సీపీఎం డివిజన్ కార్యదర్శి ఎస్.రాజు అన్నారు. కార్యక్రమంలో నాయకులు ఈశ్వర్‌నాయక్, శ్రీకాంత్, వీరేశం, నాగేశ్ తదితరులు ఉన్నారు.

భూ నిర్వాసితుల అరెస్టు

కొందుర్గు: ట్రిపుల్‌ఆర్‌లో భూములు కోల్పోతున్న రైతులను సోమవారం కొందుర్గు పోలీసులు అరెస్టు చేశారు. తమ భూముల నుంచి ట్రిపుల్‌ఆర్ వెళ్లకుండా అలైన్‌మెంట్ మార్చాలని డిమాండ్ చేస్తూ చలో హెచ్‌ఎండీఏ పిలుపుమేరకు ముందస్తుగా రైతులను అరెస్టు చేశారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. అరెస్టు అయిన వారిలో మాజీ సర్పంచ్ బాల్‌రాజ్, బీఆర్‌ఎస్ నాయకులు ప్రవీణ్ తదితరులు ఉన్నారు.